జనం పవర్
JANAM POWER

శనివారం
28 ఫిబ్రవరి 2026

## రామసాగర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

**ప్రారంభించిన సర్పంచ్ ఇంగాల లక్ష్మీ నాగమల్లేశం**

**పాడి పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ**

**కృత్రిమ గర్భాధారణ సేవలు వినియోగించుకోవాలని సూచన**



**బెజ్జంకి, ఫిబ్రవరి 27 (జనం పవర్):** మండలంలోని రామసాగర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోపాలమిత్ర ఉచిత పశువైద్య శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ ఇంగాల లక్ష్మీ నాగమల్లేశం ప్రారంభించారు. ఈ శిబిరంలో బెజ్జంకి మండల పశు వైద్యురాలు డాక్టర్ హరిత పాడి పశువులకు, దూడలకు నట్టల నివారణ మందులను తాపించారు. అలాగే పాడి పశువులకు గర్భకోశ వ్యాధులు సోకకుండా తగిన చికిత్స అందించారు. ఈ సందర్భంగా గోపాలమిత్ర పర్యవేక్షకుడు ఎండీ షాదుల్లా మాట్లాడుతూ.. పాడి రైతులు గోపాలమిత్ర కృత్రిమ గర్భాధారణ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరేశం, గోపాలమిత్రలు బొడిగ సత్తయ్య, భూపతి, లక్ష్మణ్, పాడి రైతులు గణపురం తిరుపతి, అడుకని రవి, ఇంగాల సంజీవరావు, సావుళ్ళ సంతోష్, కుసుంబ మహేందర్, అంబీరు భూమయ్య, ఇంగాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో రీడింగ్ రూమ్, ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభం!



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన రీడింగ్ రూమ్, ఫిట్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. దాతల ఆర్థిక సహకారంతో అత్యాధునిక సదుపాయాలతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దారు. న్యాయవాదుల మేధో వికాసం, శారీరక దృఢత్వానికి ఈ కేంద్రం ఎంతో దోహదపడుతుందని అతిథులు పేర్కొన్నారు. న్యాయవాదులతో పాటు విద్యార్థులకు కూడా ఈ వసతులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.





## పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ట!

- **మార్కండేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే హరీష్ రావు**
- **వైభవంగా క్షీరాభిషేకం, పుష్పార్చన, హోమ పూజలు**
- **దాతల సహకారంతో వైభవంగా సాగుతున్న ఉత్సవాలు**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణ పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో మార్కండేయ దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు పట్టణ సమిష్టి సహకారంతో, విశేష దాతల సహాయంతో వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. శుక్రవారం ఉదయం అమ్మవారికి క్షీరాభిషేకం, పుష్పార్చన, ధ్యాన దివాసం, ఆదివాసాంగ హోమం వంటి కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెద్ది అశోక్, ఇప్పకాల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి సిరిగాది బాల్ రాజు పాల్గొన్నారు. వీరితో పాటు సహాయ కార్యదర్శులు గుండు రవితేజ (లడ్డు), చిలుక ఆంజనేయులు, కోశాధికారి సూరం ప్రసాద్ విచ్చేశారు. ఈ వేడుకలో కార్యవర్గ సభ్యులు పెద్ది శ్రీనివాస్, బైరి ప్రకాష్, దీకొండ మహేష్, కొండబత్తిని రాజ్ కోటి, పేర్ల రాజేంద్రప్రసాద్, దండే సంతోష్ కుమార్, వీరబత్తిని నగేష్, ఆడేపు నాగరాజు హాజరయ్యారు. అలాగే గోటిపాముల జలజ, సిరిముల్ సునీత, పుట్ట సునీతలతో పాటు యువజన సంఘం, మహిళా సంఘం, 43 వార్డుల ప్రతినిధులు పాల్గొన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ట విజయవంతానికి సహకరించిన దాతలకు, భక్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహోత్సవం పట్టణంలో గొప్ప ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపిందని వారు పేర్కొన్నారు.

## లాల్ కమాన్.. సిద్దిపేటకు చారిత్రక ముఖద్వారం!



- **పట్టణ చరిత్రకు, సంస్కృతికి సజీవ సాక్ష్యంగా కట్టడం**
- **భారీ వాహనాల రాకపోకలతో శిథిలావస్థకు చేరుతున్న వైనం**
- **సంరక్షణ కోసం నడుం బిగించిన స్థానిక వ్యాపారులు, ప్రజలు**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని చారిత్రక కట్టడం లాల్ కమాన్ పట్టణ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఒకప్పుడు సిద్దిపేట పట్టణానికి ప్రధాన ముఖద్వారంగా నిలిచిన ఈ కమాన్‌ను స్థానికులు ప్రేమతో "కమాన్" అని పిలుచుకుంటారు. "సిద్దిపేట అంటే కమాన్.. కమాన్ అంటే సిద్దిపేట" అనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది.

పూర్వ కాలంలో ఎడ్ల బండ్లు, వాణిజ్య రవాణా ఈ కమాన్ గుండా పట్టణంలోకి ప్రవేశించేవని పెద్దలు చెబుతున్నారు. అప్పట్లో దీనిని "పెద్ద దర్వాజా" అని కూడా వ్యవహరించేవారని వృద్ధులు గుర్తుచేస్తున్నారు. సిద్దిపేట ఆధ్యాత్మిక, సాంస్కృతిక గుర్తింపుగా లాల్ కమాన్ నిలిచింది. అయితే కాలక్రమేణా పట్టణంలో ట్రాఫిక్ పెరగడం, భారీ వాహనాలు అనగా లోడుతో కూడిన ట్రక్కులు, డీసీఎంలు కమాన్ గుండా రాకపోకలు సాగించడం వల్ల కట్టడం కొంత శిథిలావస్థకు చేరిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక నిర్మాణాన్ని రక్షించేందుకు భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ప్రస్తుతం అక్కడి వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజలు, కౌన్సిలర్లు కలిసి కమాన్ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కట్టడాన్ని ఒక పవిత్ర చిహ్నంగా భావిస్తూ శుభ్రత, పరిరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. లాల్ కమాన్‌ను కాపాడుకోవడం ప్రతి సిద్దిపేట వాసి బాధ్యత అని వారు పేర్కొంటున్నారు. చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన లాల్ కమాన్‌ను భవిష్యత్ తరాలకు అందించాలంటే సంరక్షణ చర్యలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## సిద్దిపేటలో ఘనంగా "కల్చరల్ డే" వేడుకలు!









- **కాకతీయ హైస్కూల్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా వేడుకలు**
- **జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన జగ్గు మల్లారెడ్డి**
- **ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**
- **పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే "కల్చరల్ డే" వేడుకలు ఈసారి అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల ఆవరణ అంతా పండుగ వాతావరణాన్ని తలపిస్తూ విద్యార్థుల సందడి, రంగురంగుల అలంకరణలతో కళకళలాడింది. ఈ కార్యక్రమానికి బిస్మాట్ స్టేట్ జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

అనంతరం బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ మల్లారెడ్డి ప్రసంగిస్తూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని సూచించారు. సమాజం మనకు ఏమిచ్చిందన్న ఆలోచన కాకుండా, మనం సమాజానికి ఏమి చేస్తున్నామనే భావనతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆయన హితవు పలికారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆధ్యాత్మిక నృత్యాలు, జానపద కళారూపాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పలు చారిత్రక, పురాణ పాత్రల వేషధారణలతో విద్యార్థులు అందించిన ప్రదర్శనలు సందేశాత్మకంగా సాగాయి. విలువలతో కూడిన విద్యను అందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అతిథులు ఈ సందర్భంగా అభినందించారు.

ఉదయం నుంచే విద్యార్థులు వివిధ వేషధారణలతో ఉత్సాహంగా పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇదే వేదికపై పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు వారి విద్యాభ్యాసం, భవిష్యత్తు విజయాల కోసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను దిగ్విజయం చేశారు. పాఠశాల ప్రాంగణం మొత్తం సాంస్కృతిక కాంతులతో మెరిసిపోయింది.


# జర్నలిజం ముసుగులో చీకటి దందాలు

## మాజీ అధ్యక్షుడిపై ఫిర్యాదుల వెల్లువ!

సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన జర్నలిజం ముసుగులో చీకటి దందాలకు పాల్పడుతూ సామాన్య ప్రజలను పీడిస్తున్న జన్నారం ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య అరాచకాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. జర్నలిస్టులంటే గౌరవం ఇచ్చే ప్రజల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని అప్పులు చేయడం.. తిరిగి ఆ బాకీ చెల్లించమని అడిగితే ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతూ సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తూ అడ్డగోలు బెదిరింపులకు దిగుతున్న నర్సయ్య తీరుపై మండల వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. జర్నలిజం విలువలను కాలరాస్తూ ఒక అమాయక వ్యాపారిని మానసికంగా కుంగదీస్తున్న సదరు వ్యక్తితో పాటు అతని అక్రమాలకు సహకరిస్తున్న వారిపై పోలీసులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని.. వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా విచారణ జరిపించాలని బాధితులతో పాటు ప్రజా సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి.

తుడుం జితేందర్ - జనం పవర్

ఉత్తర తెలంగాణ బ్యూరో


తేది:- 9-6-25
ఫిర్యాదు పత్రము



- వ్యాపారిని బెదిరించి ప్రాంతీయ విద్వేషాల సెగ
- బాకీ తీర్చమన్నందుకు సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- నర్సయ్య, అతని కుమారుడిపై చర్యలకు ప్రజల డిమాండ్

జర్నలిజం విలువలను కాలరాస్తూ సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్న చిలువేరు నర్సయ్య ఆగడాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. రాజస్థాన్ నుంచి వలస వచ్చి ఇక్కడ వ్యాపారం చేసుకుంటున్న అమాయక వ్యాపారి రాజ్ పురోహిత్ రాంసింగ్‌ను బెదిరించడమే కాకుండా.. అతని వ్యాపారాన్ని దెబ్బతీసేందుకు నర్సయ్య కుట్ర పన్నడంపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఇరవై ఏళ్లుగా జన్నారంలో ఎలక్ట్రికల్ షాపు నడుపుతున్న రాంసింగ్ వద్ద సుమారు లక్షా ఎనభై వేల రూపాయల సామాగ్రిని అప్పుగా తీసుకున్న నర్సయ్య.. ఆ బాకీ తీర్చమన్నందుకు తీవ్రమైన బెదిరింపులకు పాల్పడ్డారు. నువ్వు వలస జీవివి అంటూ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడమే కాకుండా.. రాంసింగ్ నాసిరకం వస్తువులు అమ్ముతున్నాడంటూ సోషల్ మీడియాలో తప్పుడు వార్తలతో దుష్ప్రచారం చేస్తూ వ్యాపారాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారు.

బాధితుడు రామగుండం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ.. నర్సయ్య, అతని కుమారుడు సుధీర్ సాగిస్తున్న అక్రమాలపై స్థానిక అధికారులు తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు రహస్యంగా విచారణ జరిపితే బాధితులు మరికొంతమంది ధైర్యంగా ముందుకు వచ్చి తమ గోడు చెప్పుకుంటారని స్థానిక సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. నర్సయ్య సాగిస్తున్న బ్లాక్ మెయిలింగ్ దందాలు, అక్రమ వసూళ్లపై నిరసనగా ఇప్పటికే జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్ష పదవి నుంచి అతన్ని తొలగించారు. కేవలం పదవి నుంచి తొలగిస్తే సరిపోదని.. జర్నలిజం ముసుగులో ఇటువంటి అరాచకాలకు పాల్పడుతున్న ఇతడిని పూర్తిస్థాయిలో పత్రికా రంగం నుంచి బహిష్కరించాలని మండలంలోని వివిధ ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పోలీస్ అధికారులు గతంలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నర్సయ్య, సుధీర్‌పై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక ప్రత్యేక అధికారిని నియమించి వీరిద్దరి అక్రమ ఆస్తులతో పాటు బాధితులపై చేసిన బెదిరింపులపై రహస్య విచారణ జరపాలని కోరుతున్నారు. అన్యాయానికి గురైన రాంసింగ్‌కు న్యాయం చేసి.. అతని బకాయిలు ఇప్పించడంతో పాటు తగిన రక్షణ కల్పించాలని కోరుతున్నారు. జర్నలిస్టుల పేరుతో చెలామణి అవుతూ సమాజాన్ని పీడిస్తున్న ఇటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోకపోతే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందని జన్నారం మండల ప్రజలు హెచ్చరిస్తున్నారు.



# విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులకు ఘన సన్మానం!

- నూతనంగా ఎన్నికైన జిల్లా, రాష్ట్ర నాయకులకు సత్కారం
- నగరంలోని సంఘ భవనంలో ఘనంగా వేడుక
- బకాయి ఉన్న డీఏలు, పీఆర్సీ సాధనే లక్ష్యం కావాలని పిలుపు




**కరీంనగర్, ఫిబ్రవరి 27 (జనం పవర్):** కరీంనగర్ జిల్లా రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ఎం డీ ఉస్మాన్ పాషా, ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు నాగమోహన్ ను నగరంలోని సంఘ భవనంలో ఘనంగా సన్మానించారు. వారితో పాటు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జీ వీ మనోహర్ కుమార్, కోశాధికారి రామచంద్రంలను విశ్రాంత ఉపాధ్యాయులు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు ఏ శ్రీధర్ రావు, గంట్ల నరసింహారెడ్డి, బీ నరేందర్, సీ హెచ్ రమేష్ రెడ్డి, పీ రామ్ చంద్ర రావు, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, కర్ర ప్రభాకర్ రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు బకాయి ఉన్న డీఏలు, మెరుగైన పీఆర్సీ ఇప్పించడానికి జిల్లా శాఖ, రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

# వైద్య సేవల బలోపేతానికి కృషి చేయాలి!

- ములుగు ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి తనిఖీలు
- వేసవి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశం
- మహిళా ఆరోగ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచన

జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి

రానున్న ఎండాకాలంలో తలెత్తే ఆరోగ్య సమస్యలపై ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలని సిద్దిపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అధికారులకు సూచించారు. వేసవిలో సాధారణంగా కనిపించే డీహైడ్రేషన్, వైరల్ జ్వరాలు, అజీర్ణ సమస్యలు, వడదెబ్బ వంటి వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలపై క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి సమయపాలన కచ్చితంగా పాటించాలని సూచించారు. కేంద్రంలో అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పనితీరును, సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. మందుల నిల్వ ఉన్న గదిని సందర్శించి నిల్వలు, నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ప్రయోగశాలను పరిశీలించి



పరీక్షల నిర్వహణ, రికార్డుల నమోదుపై సమీక్షించారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని, వచ్చే ప్రజలకు నాణ్యమైన చికిత్స అందించాలని స్పష్టం చేశారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా అర్హులైన పిల్లలకు వంద శాతం టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తూ తగిన చికిత్స అందించాలని తెలిపారు. ముఖ్యంగా మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించి, ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# అడవుల సంరక్షణతోనే జీవవైవిధ్యం!

- ఇందన్‌పల్లి అటవీ ప్రాంతంలో విద్యార్థుల విజ్ఞాన యాత్ర
- అడవుల ప్రాముఖ్యతను వివరించిన అధికారులు
- ప్రకృతిని కాపాడాలని ఎఫ్ ఆర్ ఓ పిలుపు




జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం విజ్ఞాన యాత్ర చేపట్టారు. ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాన్ని సందర్శించిన విద్యార్థులు అడవుల ప్రాముఖ్యత, జీవవైవిధ్యం గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇందన్‌పల్లి ఎఫ్ ఆర్ ఓ లక్ష్మీనారాయణ విద్యార్థులతో ముచ్చటించారు. అటవీ అభివృద్ధి కార్యక్రమాలు, వన్యప్రాణుల రక్షణ, పర్యావరణ సమతుల్యతలో అడవుల పాత్ర గురించి ఆయన వివరించారు. అడవులు భూమికి ఊపిరితిత్తుల వంటివని, ప్రతి విద్యార్థి మొక్కలు నాటడంతో పాటు అడవులను కాపాడుకోవడంలో బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. ఎఫ్ ఎస్ ఓ హన్మంతరావు, అటవీ శాఖ సిబ్బంది విద్యార్థులకు అటవీ ప్రాంతంలోని వివిధ రకాల మొక్కలు, ఔషధ గుణాలున్న చెట్లు, జీవవరణ పరిస్థితులను వివరించారు. క్షేత్రస్థాయిలో అడవులను పరిశీలించడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజ్ఞాన యాత్రలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రా బాధ్యతల స్వీకరణ!

- నూతన కలెక్టర్‌కు అధికారుల ఘనస్వాగతం
- పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షల వెల్లువ
- కలెక్టరేట్ కార్యాలయంలో విధుల్లోకి చేరిక

**కరీంనగర్, ఫిబ్రవరి 27 (జనం పవర్):** కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్‌గా చిత్రా మిశ్రా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆమె అధికారికంగా విధుల్లోకి చేరారు. జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన చిత్రా మిశ్రాను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఏవో సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు కలెక్టర్‌కు మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో పాటు పలువురు జిల్లా అధికారులు సైతం కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.



జనం పవర్

శనివారం
28 ఫిబ్రవరి 2026

# చస్తే నేనే పోస్టుమార్టం రిపోర్ట్ రాస్తా!

- బాధితులపై జన్నారం ఎస్సై జులుం..
- స్టేషన్‌కు వచ్చిన బాధితుల పట్ల అమానవీయ ప్రవర్తన
- మహిళలకు సైతం మద్యం పరీక్షలు చేయాలని హుకుం
- ఎస్సై తీరుపై గ్రామస్తుల ఆగ్రహం.. సీపీకి ఫిర్యాదు
- తక్షణమే సస్పెండ్ చేయాలని జన్నారం మండల ప్రజల డిమాండ్




**జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

మంచిర్యాల జిల్లా జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారు తండాలో ఇటీవల జరిగిన గొడవల నేపథ్యంలో.. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చిన బాధితుల పట్ల ఎస్సై వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. గ్రామానికి చెందిన సుమారు ఇరవై మంది మహిళలు, పెద్దలు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు స్టేషన్‌కు వెళ్లారు. బాధితుల ఫిర్యాదు వినాల్సింది పోయి.. ఎస్సై వారిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

స్టేషన్‌కు వచ్చిన వారందరూ మద్యం సేవించి ఉన్నారంటూ ఎస్సై ఆరోపించారు. అక్కడున్న మహిళల పట్ల కనీస విచక్షణ లేకుండా.. అందరికీ బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించి వారిని తీవ్రంగా అవమానపరిచారు. అంతటితో ఆగకుండా "మీరు ఎందుకు కొట్లాడుకుంటారు? ఎప్పుడు ఇంతేనా? మీరు మారరా?" అంటూ బాధితులపై కేకలు వేశారు. "మీరు చస్తే చావండి.. రేపు పొద్దున చస్తే నేనే కదా పోస్టుమార్టం రిపోర్టు రాసేది" అంటూ చేసిన అమానవీయ వ్యాఖ్యలు బాధితులను దిగ్భ్రాంతికి గురిచేశాయి. స్టేషన్ నుంచి వెలుపలికి వెళ్లాలంటూ దుర్భాషలాడటంతో గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేశారు.

శాంతిభద్రతలు కాపాడాల్సిన అధికారిణి ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటంపై మండల వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. బాధితులను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా కించపరిచిన ఎస్సైపై తక్షణమే విచారణ జరిపి విధులకు దూరంగా ఉంచాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీలకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, అహంకారంతో ప్రవర్తించిన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

> రక్షణ కల్పించాల్సిన పోలీసులే భక్షకులుగా మారితే సామాన్యులకు దిక్కెవరు? న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితుల పట్ల జన్నారం ఎస్సై అత్యంత దురుసుగా, అమానవీయంగా ప్రవర్తించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చస్తే నేనే పోస్టుమార్టం రిపోర్టు రాస్తానంటూ సదరు అధికారిణి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. బాధితులను అవమానించడమే కాకుండా మద్యం తాగారంటూ మహిళలకు సైతం పరీక్షలు చేయాలని ఆదేశించడం పోలీసు వ్యవస్థకే మచ్చ తెచ్చేలా ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆదిలాబాద్‌లో సెల్‌ఫోన్ దోపిడీ ముఠా అరెస్ట్!

- ఆరుగురిపై కేసు.. 7 ఫోన్లు స్వాధీనం
- ఒంటరిగా వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలు
- నిందితులపై సస్పెక్ట్ షీట్లు నమోదు




**జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

ఆదిలాబాద్ పట్టణంలో వరుస సెల్‌ఫోన్ దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేయగా.. వారిలో ఒకరు బాల నేరస్థుడు ఉన్నారు. నిందితుల నుంచి దోపిడీకి గురైన ఏడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 15వ తేదీన ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో పని ముగించుకుని తిరిగి వెళ్తున్న సగుడారపు కనిష్క్ అనే వ్యక్తిని నలుగురు వ్యక్తులు అడ్డగించారు. బాధితుడి వద్ద డబ్బులు లేకపోవడంతో అతని మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కుని పారిపోయారు. బాధితుడు ఈ నెల 26న ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కే. నాగరాజు బృందం నిందితులను పట్టుకున్నారు.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం నిందితుల్లో సంజయ్ నగర్‌కు చెందిన సయ్యద్ నవీద్ అలీ, వడ్డెర కాలనీకి చెందిన మీర్జా ముష్రఫ్ బేగ్, షేక్ బిలాల్, ఖానాపూర్‌కు చెందిన షేక్ హర్షద్, నెహ్రూ నగర్‌కు చెందిన బన్సోడె కిషన్ కన్నయ్య ఉన్నారు. వీరితో పాటు బుక్తాపూర్‌కు చెందిన 15 ఏళ్ల బాల నేరస్థుడిపై కూడా కేసు నమోదు చేశారు. నిందితులు రైల్వే స్టేషన్, రిమ్స్ ఆసుపత్రి పరిసరాలు, బస్టాండ్ ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. వీరిపై జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే కేసులు ఉన్నాయని, వీరిపై సస్పెక్ట్ షీట్లు కూడా తెరిచామని పోలీసులు తెలిపారు.

చోరీకి గురైన లేదా సరైన పత్రాలు లేని సెల్‌ఫోన్లను ఎవరూ కొనకూడదని పోలీసులు హెచ్చరించారు. సెల్‌ఫోన్ షాపుల యజమానులు బిల్లులు లేకుండా పాత ఫోన్లు కొంటే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పదేపదే నేరాలకు పాల్పడే వారి పట్ల జిల్లా పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు.




# ముగిసిన నూతన సర్పంచుల శిక్షణ తరగతులు

- గ్రామ వికాసమే లక్ష్యంగా జన్నారం ప్రజాప్రతినిధుల అడుగులు
- పంచాయతీ రాజ్ చట్టం, గ్రామాభివృద్ధిపై అవగాహన
- ఐదు రోజుల పాటు సాగిన శిక్షణ.. ముగింపులో ప్రశంసా పత్రాల పంపిణీ

**జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాల వేదికగా గత ఐదు రోజులుగా కొనసాగుతున్న నూతన సర్పంచుల శిక్షణ తరగతులు శుక్రవారం ఘనంగా ముగిశాయి. జన్నారం మండలానికి చెందిన ఇరవై తొమ్మిది గ్రామ పంచాయతీల నూతన సర్పంచులు ఈ శిక్షణలో పాల్గొని పంచాయతీ రాజ్ చట్టం, గ్రామాభివృద్ధిపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకున్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా ప్రభుత్వం ఈ శిక్షణను ఏర్పాటు చేసింది.

ఐదు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో ప్రధానంగా గ్రామ పంచాయతీలకు వచ్చే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై నిపుణులు దిశానిర్దేశం చేశారు. పంచాయతీ రాజ్ చట్టం-2018 ప్రకారం సర్పంచ్‌లకు ఉండే అధికారాలు, గ్రామంలో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి కనీస వసతుల కల్పనలో వారి పాత్రను వివరించారు. అలాగే గ్రామ పాలనలో పారదర్శకత కోసం ఆన్‌లైన్ లావాదేవీలు, డిజిటల్ సంతకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి ప్రణాళికలు ఎలా సిద్ధం చేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు.

జన్నారం మండలం నుంచి వచ్చిన ఇరవై తొమ్మిది మంది సర్పంచులు ఈ శిక్షణలో చురుగ్గా పాల్గొన్నారు. తమ సందేహాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకున్నారు. ఈ ఐదు రోజుల శిక్షణ తమకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని, గ్రామాల అభివృద్ధికి ఎలా ముందుకు వెళ్లాలో ఒక స్పష్టమైన అవగాహన వచ్చిందని పలువురు సర్పంచులు సంతోషం వ్యక్తం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచులకు శిక్షకులు, జిల్లా అధికారులు ప్రశంసా పత్రాలను అందజేశారు. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్ది ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అధికారులు ఆకాంక్షించారు.

# బాధ్యతగల ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ!

- కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న కాంగ్రెస్ నేత
- కరోనా సమయంలో ఇచ్చిన హెచ్చరికలను పెడచెవిన పెట్టిన ప్రధాని
- ఢిల్లీ కాలుష్య సమస్యపై పార్లమెంట్ సాక్షిగా సూచనలు
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న రాహుల్ పోరాటం



**సంగారెడ్డి (జనం పవర్):** ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి కీలక పాత్ర ఉంటుంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మాత్రమే కాకుండా.. ప్రజల సంక్షేమం కోసం సరైన సమయంలో సరైన సూచనలు చేయడం ప్రతిపక్ష నేతల బాధ్యత. ఆ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్న నేతగా రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నారు. దేశంలో కరోనా మహమ్మారి వ్యాపించడానికంటే ముందే రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశారు. విదేశాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులపై కఠిన నియంత్రణలు, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టంగా సూచించారు. కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ సూచనలను పట్టించుకోలేదు. ఫలితంగా కరోనా దేశమంతా వ్యాప్తి చెంది, రెండేళ్ల పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆరోగ్య వ్యవస్థపై భారం పెరగడంతో పాటు ఆర్థికంగా కూడా దేశం భారీగా నష్టపోయింది.

ఇదే పరిస్థితి నేడు ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్య సమస్య విషయంలోనూ కనిపిస్తోంది. దేశ రాజధానిలో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతున్నా.. బాధ్యతగల ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ఈ అంశాన్ని పార్లమెంట్ సాక్షిగా ప్రస్తావిస్తూ అవసరమైన పరిష్కార సూచనలు ఇస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే రాహుల్ గాంధీ సూచనలను ప్రధానమంత్రి వింటున్నప్పటికీ.. అమలు చేయడంలో మాత్రం విఫలమవుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కరోనా విషయంలో జరిగిన నిర్లక్ష్యం ఇప్పుడు కాలుష్య సమస్యలో కూడా పునరావృతమవుతుందా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాహుల్ గాంధీ ఎప్పటికప్పుడు తన సలహాలు, సూచనలు ఇస్తున్నా.. వాటిని కార్యరూపం దాల్చడంలో కేంద్ర ప్రభుత్వం వెనుకబడుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ తన బాధ్యతను నిర్వర్తిస్తుండగా.. ప్రభుత్వంగా ఆ సూచనలను అమలు చేయడంలో విఫలమవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర పరిణామమని వారు హెచ్చరిస్తున్నారు.

# సీసీఐ పత్తి కొనుగోలు గడువును పెంచాలి!

- మార్చి చివరి దాకా కొనుగోళ్లు సాగించాలని డిమాండ్
- ఇప్పటికీ ఇళ్లలోనే 40 శాతం పత్తి నిల్వలు
- దళారుల బారిన పడకుండా రైతులను ఆదుకోవాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్



**మంచిర్యాల, ఫిబ్రవరి 27 (జనం పవర్):** జిల్లాలో పత్తి కొనుగోలు గడువును మార్చి నెలాఖరు వరకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేశారు. వేల ఎకరాల్లో నిలిచిన పత్తి పంట కొనుగోళ్లు ఇప్పుడే ఆపేస్తే రైతులు దళారుల పాలవుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికీ 40 శాతం పత్తి రైతుల ఇళ్లలోనే నిల్వ ఉందని ఆయన పేర్కొన్నారు. వర్షాల కారణంగా, కూలీల కొరతతో పాటు రవాణా సమస్యల వల్ల పత్తిని సకాలంలో కేంద్రాలకు తరలించలేకపోయారని వివరించారు. అధిక వర్షాలతో పత్తి ఉత్పత్తి ఆలస్యంగా జరిగిందని, ఇప్పటికీ చాలా చోట్ల చేనుల్లోనే పత్తి ఉందని ఆయన తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను నిలిపివేస్తే ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేసి రైతులను దోచుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే కొందరు వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోళ్లు చేస్తున్నారని బానేష్ ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి పండించడానికి రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారని, సరైన ధర రాకపోతే అప్పుల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి పత్తి కొనుగోలు గడువును పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజల కోసం ఉద్యోగులు.. ఉద్యోగుల కోసం ప్రభుత్వం!

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఉద్యోగ సంఘాల ఘన సన్మానం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** ప్రభుత్వం ఉద్యోగుల పక్షాన నిలబడుతుందని, ఉద్యోగులు ప్రజల కోసం చిత్తశుద్ధితో పని చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం, కోటి రూపాయల ప్రమాద బీమా, సహజ మరణానికి పది లక్షల రూపాయల బీమా వసతి కల్పించడంతో పాటు విద్యా విధాన పరిషత్తు ఉద్యోగులను సున్నా పది పద్దు కిందకు తీసుకురావడంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రజా భవన్‌లో వివిధ సంఘాల నాయకులు డిప్యూటీ సీఎంను కలిసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉద్యోగులందరినీ బాగా చూసుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వ పాలనలో చేపట్టే ప్రతి సంక్షేమ పథకం సమాజంలో చివరి వ్యక్తి వరకు చేరడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని ఆయన తెలిపారు. ఉద్యోగ వ్యవస్థ బలంగా ఉండాలని, వారి కుటుంబాల్లో భరోసా నింపాలనే ఉద్దేశంతోనే బీమా, ఆరోగ్య పథకాలను తీసుకొచ్చినట్లు వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని అధిగమిస్తూ సంస్థలను, వ్యవస్థలను ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో కోటి రెండు లక్షల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చేందుకు ప్రత్యేకంగా తొంభై తొమ్మిది రోజుల కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిని అధికారులు, ఉద్యోగులు సీరియస్ గా తీసుకొని కింది స్థాయి వరకు యథాతథంగా అమలు చేయాలని కోరారు.

